సాక్షి
సంగారెడ్డి
సోమవారం, 28, ఆగస్టు, 2023



శిథిలావస్థలో పాఠశాల భవనాలు

జహీరాబాద్‌లోని పలు ప్రభుత్వ పాఠశాలల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. స్లాబ్ పెచ్చులూడి పడుతుండడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు.

9లో



'గృహలక్ష్మి'కి అఫిడవిట్ కష్టాలు

పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం 'గృహలక్ష్మి' పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే నిబంధనలు, మార్గదర్శకాలు పేదలకు ఇబ్బందిగా మారాయి.

8లో

నేటి నుంచి స్పెషల్ డ్రైవ్

కొండాపూర్(సంగారెడ్డి): స్థానిక తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రత్న ప్రసాద్ ఆదివారం తెలిపారు. దోస్త్ ద్వారా రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవాలని, ఇదే చివరి అవకాశమని పేర్కొన్నారు. బీబీఏ రిటైలింగ్ మేనేజ్‌మెంట్ కోర్సులో చేరే విద్యార్థులకు అప్రెంటిషిప్ సదుపాయం ఉందని వివరించారు.

న్యూస్‌రీల్

గురుకులం ప్రిన్సిపాల్, అధ్యాపకుడి సస్పెన్షన్

నారాయణఖేడ్: మండలం జూకల్ శివారులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకులం ప్రిన్సిపాల్ సాయిరెడ్డి, అధ్యాపకుడు మహిపాల్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ సంస్థ కార్యదర్శి నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీచేశారు. తమను వేధింపులకు గురిచేస్తున్నారని, కాస్మొటిక్ చార్జీల్లో కోతలు విధిస్తున్నారని తాజాగా విద్యార్థులు గురుకులం ఎదుట ఆందోళన నిర్వహించడం, శనివారం ఆర్‌సీవో భీమయ్య విచారణ జరపడం నివేదికను కార్యదర్శికి పంపడం జరిగిపోయాయి. ఆ వెంటనే ఉత్తర్వులు జారీఅయ్యాయి. అందులో మీరావలికి ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉంది. ప్రజాసంఘాల పోరాటాల వల్లే ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుడు సస్పెండ్ అయ్యారని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింహులు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు తెంకటి కుమార్, ఆయా సంఘాల డివిజన్ నాయకులు శ్రీను, శ్రీరాం, ప్రవీణ్, రాజు తెలిపారు.

గొల్లకురుమలకు ప్రభుత్వం అండ

ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



గొర్రెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): గొల్లకురుమలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి వెల్లడించారు. ఆదివారం మండలంలోని ఇందిరానగర్, ఫత్తేపూర్‌లో గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు. అనంతరం సిర్గాపూర్ మండలం చిన్న ముబారక్‌పూర్‌కు చెందిన 50 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రాంసింగ్, ఎంపీపీలు గుర్రపు సుశీల అంజయ్య, మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు కిష్టారెడ్డి, కవిత, నాయకులు గుర్రపు జలంధర్, ఉప్పరి అంజయ్య పాల్గొన్నారు.

స్వామీజీని కలిసిన టెన్నిస్ క్రీడాకారుడు



స్వామీజీతో సాయికార్తీక్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దత్తవిజయ నంద తీర్థ స్వామీజీని రాష్ట్ర టెన్నిస్ క్రీడాకారుడు గంట సాయికార్తీక్ రెడ్డి కలిసి ఆదివారం ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొని వస్తానన్నారు. ఇటీవల చైనీస్ తైపీ వేదికగా జరిగిన ఐటీఎఫ్ టెన్నిస్ టైటిల్ విజేతగా నిలిచినట్లు పేర్కొన్నారు.

వ్యాసరచనలో విద్యార్థుల ప్రతిభ



కృష్ణ, స్వర్ణలత

వట్‌పల్లి(అందోల్): వర్సిటీ స్థాయి వ్యాసరచన పోటీల్లో జోగిపేట స్టడీ సెంటర్‌కు చెందిన విద్యార్థులు స్వర్ణలత, కృష్ణ ప్రతిభ కనబరిచారు. బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విద్యాలయం స్థాపించి 40 ఏళ్లు గడుస్తున్నా సందర్భంగా పోటీలు నిర్వహించారు. కాగా ప్రతిభావంతులకు వైస్ చాన్స్‌లర్ కే సీతారామారావు ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేసినట్లు కోఆర్డినేటర్ ఎ.గోపాల్ తెలిపారు. జోగిపేట నెహ్రూ మెమోరియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అడవిరాజు, జూనియర్ అసిస్టెంట్ టి.విద్యాసాగర్, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

ఎమ్మెల్యే క్రాంతికిరణ్ పరామర్శ

సంగారెడ్డి మున్సిపాలిటీ: చౌటకూర్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులను ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆదివారం పరామర్శించారు. వెంకటకిష్టాపూర్ ఎంపీటీసీ సభ్యురాలు శేషుగూడెం మల్లమ్మ భర్త రాములు, వెండికోలులో మాజీ సర్పంచ్ భోజన్నగారి శ్రీనివాస్ గౌడ్ తల్లి కస్తూరి, టీఆర్‌ఎస్ చక్రియాల గ్రామ శాఖ అధ్యక్షుడు తుంగె అనంత్ తల్లి శంకరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో బాధిత కుటుంబాలను పరామర్శించారు.

చెత్తాచెదారం తొలగింపు



శుభ్రం చేస్తున్న నైబర్‌హుడ్ అసోసియేషన్ సభ్యులు



శుభ్రమైన తర్వాత చెరువు ప్రాంతం

తెల్లాపూర్ మేళ్ల చెరువు కట్టపై చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు పేరుకుపోయాయి. వీటిని నైబర్ హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తొలగించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ కోరారు. దీనిని పరిశుభ్రంగా ఉంచుకొని భవిష్యత్ తరాల వారికి అందించాలన్నారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)

సీబీఐ మాజీ జేడీ ఎద్దుమైలారంలో సందర్శన

సంగారెడ్డి: మండలపరిధిలోని ఎద్దుమైలారాన్ని ఆదివారం సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సభ్యులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. పంచాయతీకి పలు విభాగాల్లో లభించిన అవార్డులు తదితర వివరాలను సర్పంచ్ మల్లారెడ్డి వివరించారు. అనంతరం యువకులు, గ్రామస్తులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్, వార్డు సభ్యులుశ్రీనివాస్, మాణిక్యం, దీలిప్, పవన్, వాణి, గ్రామపెద్దలు పుల్లారెడ్డి, పెంటయ్య, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లు



ఎలక్ట్రిక్ వాహనం

- జిల్లాలో 25 చోట్ల స్థలాల గుర్తింపు
- రోజురోజుకు పెరుగుతున్న విద్యుత్ స్కూటీల వాడకం
- పర్యావరణాన్ని కాపాడవచ్చంటున్న ప్రజలు

సంగారెడ్డి టౌన్: జిల్లాలో విద్యుత్ వాహనాల వినియోగం రోజురోజుకు పెరిగిపోతోంది. దీనికి అనుకూలంగా ప్రభుత్వ, ప్రైవేట్ భాగ్యస్వామ్య (పీపీపీ) పద్ధతిలో పబ్లిక్ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ టీఎస్ రెడ్కో దరఖాస్తుల ఆహ్వానిస్తోంది. పర్యావరణ కాలుష్యం, చమురు వినియోగాన్ని తగ్గించేందుకు ఈ వాహనాలను ప్రోత్సహించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. పెరిగిన వాహన, ఇంధన ధరలతో ప్రజలు వీటిపై ఆసక్తి చూపుతున్నారు. దీనికి తోడు రాయితీలు, కొన్ని కంపెనీల నెట్‌వర్క్ మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడంతో వీటి వాడకం పెరిగిపోతోంది. జిల్లాలో 25 చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు అలవైన స్థలాలను గుర్తించారు. సంగారెడ్డి, సదాశివపేట, కంది, శంకర్‌పల్లి, పటాన్‌చెరు, సదాశివపేట నేషనల్ హైవే, అందోల్, బొంతపల్లి, జహీరాబాద్, నారాయణఖేడ్, జోగిపేట్‌లోని వివిధ స్థానాలలో అక్కడక్కడ ఏర్పాటు చేస్తారు.

పదేళ్లపాటు నిర్వహించుకునే అవకాశం



తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల స్టేషన్లను ప్రైవేట్, పబ్లిక్ భాగ్యస్వామ్యం పద్ధతిలో ఏర్పాటు చేస్తున్నది. టీఎస్ రెడ్కో ఎంపిక చేసిన ఆపరేటర్లకు పదేళ్ల వరకు రెవెన్యూ, షేరింగ్ ఆధారితంగా ల్యాండ్ కేటాయిస్తారు. గైడ్‌లెన్స్ ప్రకారం సొంత ఖర్చులతో ఏర్పాటు చేసుకొని నిర్వహించాలి. సెప్టెంబర్ 4 లోగా కార్యాలయంలో వీరికి కేటాయింపులు జరుగుతాయి.

– మాణిక్యం, జిల్లా మేనేజర్

నిర్వహణ ఖర్చు తక్కువ



విద్యుత్ వాహనాల వాడకంతో పర్యావరణ కాలుష్యం ఉండదు. నిర్వహణ ఖర్చు తక్కువ. ప్రస్తుతం ఇంటి వద్ద చార్జింగ్ చేసుకొని ప్రయాణించాల్సి వస్తోంది. జిల్లాలో అక్కడక్కడ చార్జింగ్ స్టేషన్లో ఏర్పాటు చేస్తే అందరికీ సౌకర్యవంతంగా ఉంటుంది. వీటిసంఖ్య పెరిగే అవకాశం ఉంది.

– ఆకాశ్, సంగారెడ్డి, విద్యుత్ వాహనదారుడు

చార్జింగ్ వాహనాల సంఖ్య పెరుగుతోంది

జిల్లాలో అనేక చోట్ల వాహనాల చార్జింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేస్తే వినియోగదారులు ప్రయాణించడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయి. ఎంత దూరమైనా ప్రయాణించవచ్చు. వీటితో చార్జింగ్ వాహనాల సంఖ్య కూడా పెరుగుతుంది.

– వెంకట్, వాహనచోదకుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

దుష్ప్రచారాలను ఎండగట్టండి

- సోషల్ మీడియా వేదికలపై ప్రభుత్వ ప్రగతిని వివరించండి
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్ చెరు: సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సోషల్ మీడియా వేదికల ద్వారా విస్తృతంగా ప్రచారం చేసి ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని ఎప్పటికప్పుడు ఎండగట్టాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో.. బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి సోషల్ మీడియా వర్క్ షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన, తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ చైర్మన్ పాటిమీది జగన్‌మోహన్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫోన్ వినియోగం పెరిగిన ప్రస్తుత సమాజంలో ప్రభుత్వ కార్యక్రమం సామాజిక మాధ్యమం ద్వారా ప్రజలకు తక్కువ సమయంలో సమాచారం అందిస్తున్నామన్నారు. అవాస్తవాలను దీని ద్వారానే తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి ముగ్గురిలో ఇద్దరు వాడుతున్నారన్నారు. ఇందుకనుగుణంగా పార్టీ సోషల్ మీడియా విభాగం పని చేయాలని సూచించారు. వచ్చే ఎన్నికలలో ప్రభుత్వం ముచ్చటగా మూడోసారి హ్యాట్రిక్ విజయం సాధించబోతున్నదన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జగన్ మోహన్ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సంక్షేమ రాజ్యాన్ని నెలకొల్పారన్నారు. ప్రతి ఒక్కరూ సోషల్ మీడియా ఖాతాలు యాక్టివేట్ చేసుకొని, నియోజకవర్గంలో చేపడుతున్న పనులను గడపగడపకు చేర్చాలని విజ్ఞప్తి చేశారు. భారీ మెజారిటీతో మహిపాల్ రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

చింతా ప్రభాకర్‌కు మద్దతుగా ర్యాలీ



ర్యాలీ చేస్తున్న యువకులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఇటీవల బీఆర్‌ఎస్ సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా చింతా ప్రభాకర్‌ను అధిష్టానం ప్రకటించడంపై ఇంద్రకరణ్ గ్రామ యువత హర్షం వ్యక్తం చేశారు. మహిపాల్ యాదవ్ ఆధ్వర్యంలో ఇంద్రకరణ్ నుంచి కంది మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో చింతా ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. అనంతరం 60 మంది యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరందరికీ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలో విశాల్, నర్సింలు, రాహుల్, రామకృష్ణ , వికాస్, రోహిత్ తదితరులు ఉన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న వ్యక్తి అని అన్నారు. ఆయన గెలుపునకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, మల్లేశం, సామెల్, వెంకటేశం, ఈశ్వర్, గణేష్ తదితరులున్నారు.

వీరభద్రస్వామికి అభిషేకాలు



అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడలో గల భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవాలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం కావటంతో ఆయా ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అభిషేకాలు, కుంకుమార్చనలను భక్తులు నిర్వహించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ శశిధర్, పర్యవేక్షకుడు సోమయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

గద్దర్‌కు నేతల నివాళి



గద్దర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

సంగారెడ్డి అర్బన్: బహుజన సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో గద్దర్ సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. పార్టీలకు అతీతంగా నాయకులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ చైర్మన్ చింతా ప్రభాకర్, ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, ఎమ్మెల్సీ సత్యనారాయణ, డీసీసీబీ ఉమ్మడి జిల్లా వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, బీజేపీ నాయకులు జగన్, టీఎస్‌పీఎస్సీ సభ్యులు సత్యనారాయణ పాల్గొన్నారు. తొలుత గద్దర్ యాదిలో కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆలయాల అభివృద్ధికి సర్కారు కృషి

టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ చైర్మన్ శ్రీనివాస్



శ్రీనివాస్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

ఝరాసంగం(జహీరాబాద్): రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని టీఎస్ ఎంఎస్‌ఐడీసీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమైక్యాంధ్రలో ప్రజాపాలనతోపాటు దేవాలయాల అభివృద్ధిపై చిన్న చూపు ఉండేదని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం కేసీఆర్ పాలనలో ఆలయాలు సైతం ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. ఈ ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అమలుపై మంత్రి దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ప్రభుత్వానికి ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. తొలుత పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి పూజలు చేసి మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందించి, పూలమాల శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నామ రవి కిరణ్, సంగారెడ్డి, రాజేందర్ సింగ్, శ్రీకాంత్ పటేల్, రాములు నేత, మాణిక్యం యాదవ్, శివ శంకర్ యాదవ్, పాండు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తరలింపు

- వట్‌పల్లి మండలంలో ప్రభుత్వ ఆదాయానికి గండి
- అధికారుల తీరుపై స్థానికుల అనుమానం?



టిప్పర్ ద్వారా తరలిస్తూ...

వట్‌పల్లి(అందోల్): అక్రమార్కులు పట్టపగలే జోరుగా మట్టి అక్రమంగా తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. రెవెన్యూ శాఖలోని పలువురు వీరికి సహకరిస్తున్నారన్న అనుమానాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా సమాచారమిస్తే ఇప్పుడే సిబ్బందిని పంపుతున్నామని అంటున్నారే గానీ ఎవరినీ పంపడ లేదని సమాచారం. ఇటీవల అల్లాదుర్గం మండల పరిధిలో ఓ రైసుమిల్ నిర్మాణానికి టిప్పర్ల ద్వారా పెద్ద ఎత్తున తరలించినా చూసీచూడనట్లు వ్యవహరించారని విమర్శలున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో ఎక్కడ తవ్వకాలు జరిపినా హెక్టారుకు రూ. 50 వేలు, గనుల శాఖకు మరో రూ.50 వేలు తపాల శాఖలో రిజిస్ట్రేషన్‌కు చెల్లించాలి. విక్రయాలపై అదనంగా 2.25 శాతం పన్ను చెల్లించాల్సి ఉండగా, రూ.లక్షల్లో ప్రజాధనం అక్రమార్కుల జేబుల్లోకి వెళ్లిపోతోంది. బహిరంగ మార్కెట్‌లో టిప్పర్ లోడు ధర రూ. 1,200 నుంచి 1500 వరకు విక్రయిస్తున్నారు. ఈ వ్యాపారం మూడు పూలు ఆరు కాయలు అన్న చందంగా సాగుతోందని స్థానికులు అంటున్నారు.

అనుమతులిలా

ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో తవ్వకాలు చేపట్టేందుకు గనులు, భూగర్భ శాఖ జిల్లా ఆఫీస్‌లో అనుమతి పొందాలి. ఇవి రెండు రకాలుగా ఉన్నాయి. ముందుగా ఇళ్ల నిర్మాణాలకు తక్కువ మొత్తంలో అవరమున్న వాటికి తహసీల్దార్ నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలి. తర్వాత మీసేవా ద్వారా గనులు, భూగర్భశాఖకు దరఖాస్తు చేసుకోవాలి. ఒక నెల వరకు తవ్వకుంటే కలెక్టర్ అనుమతి కోరాలి. అంతకు ముందే భూగర్భశాఖ, కాలుష్య, నియంత్రణ, డీఎఫ్‌వో, సంబంధిత ఆర్డీఓ, తహసీల్దార్ అనుమతులు తీసుకోవాలి. వీరు స్థలాన్ని పరిశీలించి కలెక్టరేట్‌కు నివేదిక అందజేస్తారు.

క్రిమినల్ కేసులు పెడతాం

నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా ఎవరైనా మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటాం. ట్రాక్టర్లు, జేసీబీ, టిప్పర్‌లను సీజ్ చేస్తాం. ఇందుకు పోలీసు శాఖ సహకారం తీసుకుంటాం. అక్రమార్కులపై క్రిమినల్ కేసులు పెడతాం.

– ఎం.శ్రీనివాస్‌రావు, వట్‌పల్లి తహసీల్దార్

క్లుప్తంగా

వాల్‌పోస్టర్లు అతికించొద్దు



ఎస్‌ఐకి వినతిపత్రం సమర్పిస్తున్న లింగాయత్ సమాజ్ బాధ్యులు

నారాయణఖేడ్: పట్టణంలోని బసవేశ్వర చౌక్‌లో వాల్‌పోస్టర్లు అతికించకుండా చర్యలు తీసుకోవాలని వీరశైవ లింగాయత్ సమాజ్ బాధ్యులు నారాయణఖేడ్ ఎస్‌ఐ విద్యాచరణ్ రెడ్డికి ఆదివారం వినతిపత్రం సమర్పించారు. తరచూ చౌక్‌లోని బసవేశ్వర విగ్రహం చుట్టూ పోస్టర్లు అతికిస్తూ వీరశైవ సమాజం మనోభావాలు దెబ్బతీస్తున్నారని వివరించారు.

లేగదూడను చంపితిన్న చిరుత!



లేగదూడ కళేబరం

చేగుంట(తూప్రాన్): లేగదూడపై చిరుత దాడి చేసి చంపితిన్న సంఘటన మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లి పులిగుట్ట తండాలో ఆదివారం ఉదయం వెలుగు చూసింది. స్థానికుల వివరాలు. తండాకు చెందిన మాలోతు కృష్ణ రోజుమాదిరిగా పశువులను పొలం వద్ద కట్టేశాడు. ఒక లేగదూడ పాకలో కనిపించకపోవడంతో మేతకు వెళ్లిందనుకున్నాడు. శనివారం రాత్రి వరకు అది రాలేదు. ఆదివారం వెతకగా పొలానికి కొంత దూరంలో సగం తినేసిన కళేబరం కనిపించింది. తండావాసుల సమాచారం మేరకు అటవీశాఖ సెక్షన్ అధికారి ఓం ప్రకాశ్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పాదముద్రల ఆధారంగా లేగదూడను చిరుతపులి చంపి తిన్నట్లు నిర్ధారించారు. దీంతో తండావాసులు భయాందోళనకు గురయ్యారు.

స్వీయ రక్షణకు కరాటే దోహదం



విద్యార్థులతో ఏసీపీ రమేశ్

గజ్వేల్‌రూరల్: స్వీయ రక్షణకు కరాటే దోహదపడుతుందని గజ్వేల్ ఏసీపీ రమేశ్ పేర్కొన్నారు. జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆదివారం కరాటే బెల్ట్ ఎగ్జామ్‌తోపాటు పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్, జగదేవ్‌పూర్‌ల నుంచి వచ్చిన సుమారు 120మంది కరాటే విద్యార్థులు ప్రదర్శించిన విన్యాసాలను తిలకించి వారిని ఏసీపీ అభినందించారు. అనంతరం ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జపాన్ కరాటే అసోసియేషన్ జిల్లా చీఫ్ రాచకొండ ఆంజనేయులు, సౌత్ ఇండియా చీఫ్, ఎగ్జామినర్ రాపోలు సుదర్శన్, జోనల్ చీఫ్ భాగ్యరాజు, కరాటే మాస్టర్లు బాల్‌రాజు, నవీన్, పవన్‌కల్యాణ్, ఆకాంక్ష, దిలీప్, ఏతజస్విన్, ప్రవీణ్, కీర్తన పాల్గొన్నారు.

‘గృహలక్ష్మి’కి అఫిడవిట్ కష్టాలు

- గ్రామాల్లో అబాధి స్థలాలకు లేని ఆధారాలు
- సాదాబైనామాలకు తప్పని తిప్పలు
- ఒక్కో అఫిడవిట్‌కు రూ.400 వరకు ఖర్చు
- పేదలకు తప్పని ఆర్థిక భారం



గృహలక్ష్మి దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

హుస్నాబాద్‌రూరల్: పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ‘గృహలక్ష్మి’ పథకాన్ని ప్రవేశపెట్టింది. సొంత స్థలంలో ఇల్లు నిర్మాణం కోసం రూ.3 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించింది. ఇందుకోసం గ్రామాల్లో అధికారులు దరఖాస్తులు స్వీకరించింది. ప్రస్తుతం దరఖాస్తుల విచారణ ప్రక్రియ నడుస్తోంది. అయితే గృహలక్ష్మి పథకానికి సంబంధించి ప్రభుత్వం విధించిన నిబంధనలు, మార్గదర్శకాలు పేదలకు ఇబ్బందిగా మారాయి. గ్రామాల్లోని అబాధి, సాదాబైనామా స్థలాలకు సరైన ఆధారాలు (పత్రాలు) లేక దరఖాస్తులు ఆన్‌లైన్ కావడం లేదు. దీంతో దరఖాస్తుదారులు అఫిడవిట్ల కోసం పరుగులు పెడుతున్నారు. గతంలో గ్రామాల్లో పేదలకు పంపిణీ చేసిన ఇంటి స్థలాలకు ప్రభుత్వం ఎలాంటి పత్రాలు ఇవ్వలేదు. ఆ స్థలాల్లో తండ్రీకొడుకుల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇప్పుడు వారు వేర్వేరుగా గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. వీరికి సొంత స్థలం ఉన్నా దానికి సంబంధించిన ఆధారాలు లేకపోవడం సమస్యగా మారింది. అదేవిధంగా గ్రామాల్లో సాదాబైనామాల ద్వారా ఎక్కువ మంది ఇంటి స్థలాలను కొనుగోలు చేసి గృహాలను ఏర్పాటు చేసుకున్నారు. ఎప్పుడో 40 ఏళ్ల కింద నిర్మించిన పెంకుటిల్లు, రేకుల షెడ్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడంతో గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. అయితే ప్రభుత్వ నిబంధనలు పథకానికి దూరం చేసేలా ఉన్నాయని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి స్థలానికి ఆధారాలు లేనివారి దరఖాస్తులు ఆన్‌లైన్ కావని, అఫిడవిట్ సమర్పించాల్సిందేనని అధికారులు సూచిస్తున్నారు. అయితే వీటిని అక్కన్నపేట మండలంలో తీసుకోవడం లేదని, హుస్నాబాద్‌లో మాత్రం అడుగుతున్నారని బాధితు లు ఇటీవల ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకుపోయారు.

గ్రామకంఠం భూములకు కాగితాల్లేవ్..

గ్రామ పంచాయతీ పరిధిలోని అబాధి భూముల్లో పూరి గుడిసెలు, పెంకుటిల్లు నిర్మించుకున్న పేదలకు ప్రభుత్వం ఎలాంటి పత్రాలు ఇవ్వలేదు. మరికొంత మంది సాదాబైనామాల ద్వారా స్థలాలు కొనుగోలు చేసిన వారి దగ్గర ఇంటి నంబరు, పన్ను చెల్లించిన రసీదులు మాత్రమే ఉన్నాయి. వీటి ఆధారంగా దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు క్షేత్రస్థాయి విచారణకు వెళ్లినప్పుడు ఈ స్థలం మీదేనని ఆధారాలు చూపాలని అడుగుతున్నారు. దరఖాస్తుదారుల దగ్గర ఎలాంటి కాగితాలు లేకపోవడంతో బిక్కముఖం వేస్తున్నారు. కనీసం స్థలం మీదే అన్నట్లు న్యాయవాది నుంచి అఫిడవిట్ తీసుకురావాలని అధికారులు సూచిస్తున్నారు. దీంతో అఫిడవిట్‌ల కోసం పేదలు డివిజన్ కేంద్రం, హుస్నాబాద్, కరీంనగర్ ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు. ఒక్కొక్క అఫిడవిట్‌కు రూ.400, రవాణా ఖర్చుతో కలిపి మొత్తం రూ.1000 ఆర్థిక భారం అవుతుందని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆధారాలుంటే ఆన్‌లైన్ చేయవచ్చు

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహలక్ష్మి పథకం పొందాలంటే ఇంటి స్థలానికి సంబంధించిన ధ్రువ పత్రాలు దరఖాస్తుకు జత చేయాల్సి ఉంటుంది. లేదా వారు ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి నంబరుతో అఫిడవిట్‌ను జత చేస్తే పంచాయతీ కార్యదర్శులు దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తారు. గ్రామాల్లో ఎవరూ ఇంటి స్థలాలను రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. ఇల్లు నిర్మించుకుంటే నంబరు ఇచ్చేవారు. ఇంటి పన్ను రసీదే వారికి ఆధారంగా ఉంది.

– కుమారస్వామి,
ఎంపీడీఓ, హుస్నాబాద్

కేసీఆర్‌వి మోసపూరిత వాగ్దానాలు



మాట్లాడుతున్న శశాంక్ త్రివేది

హుస్నాబాద్: సీఎం కేసీఆర్ మోసపూరిత వాగ్దానాలు చేస్తూ, ఆయన కుటుంబ సభ్యుల కోసం కొత్త బంధులు ప్రవేశపెడుతూ పేదల నోట్లో మట్టి కొడుతున్నారని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర మొహాలీ ఎమ్మెల్యే శశాంక్ త్రివేది దుయ్యబట్టారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా ఆదివారం బీజేపీ నాయకులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014 ఎన్నికల సమయంలో గౌరవెల్లి ప్రాజెక్టు వద్ద కుర్చీ వేసుకొని మరీ పూర్తి చేస్తానన్న కేసీఆర్.. పదేళ్లవుతున్నా పూర్తి చేయకపోవడం స్థానిక ఎమ్మెల్యే సతీశ్ కుమార్ వైఫల్యమన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటే అని తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దన్నారు. ఎన్నికలప్పుడే కేసీఆర్ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి.. బంధుల పేరిట మోసం చేస్తున్నాడని విమర్శించారు. లిక్కర్ మాఫియాలో కవిత పాత్ర ఉంది కాబట్టే ఈడీ విచారణ చేపట్టిందని, త్వరలో ఆమె జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, జిల్లా ఉపాధ్యక్షుడు విజయపాల్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, కో కన్వీనర్ వేణుగోపాల్‌రావు, పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు, విద్యాసాగర్‌రెడ్డి, వీరాచారి, పృథ్వీరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, చిరంజీవి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

దుబ్బాకలో మళ్లీ బీజేపీదే గెలుపు

షోలాపూర్ ఎమ్మెల్యే
సుభాష్ సురేష్‌చంద్ర దేశ్‌ముఖ్



మాట్లాడుతున్న సుభాష్ సురేష్ చంద్ర దేశ్‌ముఖ్

దుబ్బాకటౌన్: రానున్న ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు భారీ మెజార్టీతో మళ్లీ గెలుస్తారని షోలాపూర్ ఎమ్మెల్యే సుభాష్ సురేష్ చంద్ర దేశ్‌ముఖ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధిష్టానం పిలుపు మేరకు 10రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విధానసభ ప్రవాస్‌యోజన కార్యక్రమంలో భాగంగా దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జిగా వచ్చినట్లు తెలిపారు. అన్ని మండలాల్లో పర్యటించి ప్రజల అభిప్రాయాలు సేకరించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో బీజేపీ క్యాడర్ పటిష్టంగా ఉందని తెలిపారు. దుబ్బాకలో మరోసారి బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. అనంతరం ప్రధాని మోదీ నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆయన వీక్షించారు. సమావేశంలో అంబటి బాలేష్, సంతోష్, వంశీ, శ్రీనివాస్, భాస్కర్ ఉన్నారు.

అనాథ పిల్లలకు భరోసా



సాయం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాలలో తల్లిదండ్రుల మృతితో అనాథలుగా మారిన ముగ్గురు ఆడపిల్లలకు స్వచ్ఛంద సంస్థలు మేమున్నామంటూ భరోసానిచ్చాయి. గ్రామానికి చెందిన దొడ్డి యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. రెండేళ్ల క్రితమే అతడి భార్య కూడా మృతిచెందింది. దీంతో ముగ్గురు ఆడపిల్లలు అనాథలుగా మారిన విషయం ఇటీవల సాక్షి దిన పత్రికలో కథనం ప్రచురితమైంది. కాగా, గజ్వేల్‌కు చెందిన చెలిమి ఫౌండేషన్ సభ్యులు స్పందించి పిల్లలకు నిత్యావసర సరుకులతో పాటు రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే గజ్వేల్‌కు చెందిన భరోసా ఫౌండేషన్ సభ్యులు కూడా చిన్నారులకు రూ.25వేల సాయం అందించారు. కార్యక్రమంలో చెలిమి ఫౌండేషన్ అధ్యక్షుడు గుర్రల తులసీదాస్, సభ్యులు కిరణ్‌కుమార్, ఆనంద్, గుంటుకు శ్రీనివాస్, ఆంజనేయులు, రమేశ్, ఇబ్రహీం, బాల్‌కుమార్, పెద్దూరి శ్రీనివాస్, ఆంజనేయులుగౌడ్, బాబు, భరోసా ఫౌండేషన్ సభ్యులు భాస్కర్, నరేష్, రాజుగౌడ్, ప్రసాద్, గణేశ్, తేజ, ఆగంరెడ్డి, రమణ, వెంకట్ పాల్గొన్నారు.

కేబుల్ వైర్ దొంగల పట్టివేత



కేబుల్ వైర్ చోరీ చేస్తూ రైతులకు పట్టుబడిన దొంగ

కొల్చారం(నర్సాపూర్): బోరు మోటార్ల వద్ద కేబుల్ వైర్లను దొంగలిస్తున్న ముగ్గురిని పోలీసులకు అప్పగించిన సంఘటన మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామ శివారులోని బోరు మోటార్ల వద్ద దొంగతనం చేసిన కేబుల్ వైర్‌ను సంచిలో పెట్టుకొని బైక్ పై పారిపోతుండగా రైతులు గమనించి వెంబడించారు. వీరిలో ఇద్దరు పారిపోగా ఒక్కరు దొరికారు. అతని సమాచారం మేరకు మరో ఇద్దరిని రైతులు పట్టుకొని కొల్చారం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. వీరిలో ఒకరు పైతర గ్రామానికి చెందినవాడు కాగా, మరో ఇద్దరు పాపన్నపేట మండలం బాచారం, కొడిపల్లికి చెందిన వారుగా గుర్తించారు. కేబుల్ వైర్లు దొంగలించి ఇతర ప్రాంతాల్లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు వారు నేరం ఒప్పుకున్నారు. వీరి నుంచి చోరీ చేసిన కేబుల్ వైర్‌తో పాటు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అన్నిరంగాల్లో సిద్దిపేట ముందంజ

ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని మంత్రి హరీశ్‌రావుకు అందిస్తున్న కాలనీవాసులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆసుపత్రులు ఖాళీగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉన్నట్లని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. పట్టణంలోని 3వవార్డు పరిధిలోని హరిహర రెసిడెన్సీ కాలనీ ప్రజలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకే ఏకగ్రీవంగా ఓటు వేస్తామని తెలుపుతూ మంత్రికి ఆదివారం ఏకగ్రీవ తీర్మాన పత్రం అందించారు. అంతకుముందు కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కాలనీ వాసులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సిద్దిపేట అభివృద్ధికి అనేక నిధులు కేటాయించారని, ఇందులో భాగంగా అన్ని రకాల విద్యాసంస్థలు ఇక్కడ కొలువయ్యాయన్నారు. అదేవిధంగా సిద్దిపేటలో 1000 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేవలం ఎన్నికల సమయంలో వచ్చే వారి మాటలు నమ్మొద్దన్నారు. సిద్దిపేట ప్రజలకు కోమటి చెరువు, రంగనాయక సాగర్‌లాంటి పర్యాటక ప్రాంతాలు ఉన్నాయన్నారు. హరిహర రెసిడెన్సీ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వంగనాగిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, రేణుక పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత

క్రీడలతో ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. జపాన్ కరాటే షోటో ఫెడరేషన్ రెండో రాష్ట్రస్థాయి ఓపెన్ టు ఆల్ కరాటే ఛాంపియన్‌షిప్ సిద్దిపేటలో తెలంగాణ రాష్ట్ర కరాటే చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ ఎమ్మెస్ పాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో 33 జిల్లాల నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కట, కుమితే అనే అంశాలలో వివిధ ఏజ్ గ్రూపుల వారీగా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు మంత్రి బహుమతులు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కరాటే అసోసియేషన్ అధ్యక్షులు సెన్సాయి శ్రీనివాస్, నరేందర్, సాయికుమార్, పాపయ్య, ఎల్లాగౌడ్, దాసు పాల్గొన్నారు.

మా మద్దతు మీకే..

సిద్దిపేటజోన్: మా ఓటు, మద్దతు బీఆర్‌ఎస్‌కే అని కుల సంఘాలు ఏకగ్రీవం చేసిన తీర్మాన పత్రాలు క్యాంపు కార్యాలయంలో మంత్రి హరీశ్‌రావుకు అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని తోర్నాల రజక, మున్నూరుకాపు, రావురూకుల కురుమ, చిన్న గుండవెల్లి గంగపుత్ర, ముదిరాజ్, ఇర్కోడు హనుమంతునిపల్లె ముదిరాజ్, సిద్దిపేటలోని హనుమాన్ నగర్ ముదిరాజ్ సంఘాల ప్రతినిధులు మంత్రికి సంఘీభావం ప్రకటించారు.

విద్యార్థులకు అభినందన

గజ్వేల్: నీట్‌లో అత్యుత్తమ ర్యాంకులతో మెడిసిన్‌లో సీటు సాధించిన గజ్వేల్ జెడ్పీటీసీ మల్లేశం కుమారుడు శివనందన్‌కుమార్, కూతురు అక్షరవీణలను మంత్రి హరీశ్‌రావు అభినందించారు.

విద్యార్థులకు గొడుగులు



గొడుగులతో టీహెచ్‌ఆర్ ఆకారంలో విద్యార్థులు

బెజ్జంకి(సిద్దిపేట): మంత్రి హరీశ్‌రావు స్వగ్రామమైన మండలంలోని తోటపల్లిలో సర్పంచ్ బోయినిపెల్లి నర్సింగరావు రూ. 45 వేలు వెచ్చించి ఆదివారం గొడుగులను పంపిణీ చేశారు. విద్యార్థులకు వర్షాకాలంలో ఉపయోగపడాలనే గొడుగులను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మమత, ఎంపీటీసీ లక్ష్మి, నాయకులు రాములు, శ్రీనివాస్, వెంకటస్వామి, సతీష్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన భూపంపకం

అన్న చేతిలో తమ్ముడి హతం



రాంచందర్ మృతదేహం

కొండాపూర్(సంగారెడ్డి): భూమి పంపకాల గొడవలో తమ్ముడిని అన్న హత్య చేసిన ఘటన శనివారం అర్ధరాత్రి కొండాపూర్ మండలం కోనాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై వినయ్‌కుమార్ తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన బేగరి రవీందర్, బేగరి రాంచందర్ (30) అన్నదమ్ములు. వీరి చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోయారు. చిన్నవాడైన రాంచందర్‌కు పెళ్లి అయినప్పటికీ కుటుంబ కలహాల కారణంగా భార్యతో విడాకులు తీసుకున్నాడు. అప్పటినుంచి పనులు చేయగా వచ్చిన డబ్బుతో మద్యం తాగేవాడు. అన్న రవీందర్‌కు ఒక ఎకరా 15 గుంటల భూమి ఉండగా, రాంచందర్‌కు కేవలం 8 గుంటల భూమి మాత్రమే అతని పేరుపై ఉంది. తాగిన మైకంలో వచ్చి భూమిలో సగం కావాలని తరచూ అన్నతో గొడవపడేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి కూడా వాగ్వాదం చోటుచేసుకోగా ఆగ్రహించిన రవీందర్ తమ్ముడిని కొట్టి మెడకు చున్నీతో బిగించి హత్య చేశాడు. గ్రామస్తుడు కావలి గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీఐ చంద్రయ్య దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పొగాకు వాడకం ప్రమాదం



అవగాహన కల్పిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

నారాయణఖేడ్: పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో ఆదివారం జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా యువకులకు అవగాహన కల్పించారు. పొగాకు ఉత్పత్తులు బీడీ, చుట్ట, సిగరెట్, జర్దా, తంబాకు, పాన్‌మసాలా లాంటి వాటిని ఉపయోగించకూడదని తెలిపారు. వాటి వాడకం వల్ల మనుషుల్లో హైపర్‌టెన్షన్, నోటి కేన్సర్, శ్వాసకోశ, గుండె సంబంధిత వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం సెక్షన్ 4 ప్రకారం నేరమని, రూ.200జరిమానా విధిస్తామని అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పవన్, పుండరీకం, సర్దార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

దీపాయంపల్లిలో వీఆర్‌ఏ ఆత్మహత్య

వాటాదారులకు డబ్బులు చెల్లించలేక బలవన్మరణం



నగేశ్ (ఫైల్)

రాయపోలు(దుబ్బాక): వాటాదారులకు ఒప్పుకున్న డబ్బులు చెల్లించలేక వీఆర్‌ఏ బలవన్మరణానికి పాల్పడిన సంఘటన దౌల్తాబాద్ మండలం దీపాయంపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై చైతన్యకుమార్, గ్రామస్తుల వివరాలు. గ్రామానికి చెందిన మస్కూరి నగేశ్ (42) ఇటీవలే ప్రభుత్వం చేపట్టిన వీఆర్‌ఏల క్రమబద్ధీకరణలో ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత పొందాడు. అతనికి వ్యవసాయశాఖలో పనిచేసే అవకాశం వచ్చింది. కాగా ఇప్పటి వరకు వీఆర్‌ఏ (మస్కూరి) విధులను నాలుగు కుటుంబాలకు చెందిన వారు వాటాదారులుగా ఉండేవారు. కాగా ఆ కుటుంబం నుంచి నగేశ్ ఒక్కడే ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత పొందడంతో మిగతావారు తమ వాటా కింద డబ్బులు చెల్లించాలని పట్టుబట్టారు. దీంతో వారికి రూ.55లక్షలు చెల్లించేందుకు నగేశ్ ఒప్పందం చేసుకుని ఉద్యోగంలో చేరాడు. కాగా, ఈ నెల 26న వాయిదా సొమ్ము చెల్లించాల్సి ఉంది. డబ్బులు ఎక్కడా సమకూరకపోవడంతో తనకున్న భూమి నుంచి 30గుంటలు ఇచ్చేందుకు నగేశ్ అంగీకరించినా.. వాటాదారులు ఆ భూమి విలువ రూ.55లక్షలు ఉండదని, డబ్బులే కావాలని మొండికేశారు. దీంతో డబ్బులు ఎలా ఇవ్వాలో తెలియక ఈ నెల 24న పురుగుల మందు తాగాడు. గమనించిన కొందరు అతన్ని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో తరలించగా, పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత మృతిచెందాడు. వాటా దారుల సొమ్మును చెల్లించలేక తన భర్త మృతిచెందాడని మృతుని భార్య మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో యువకుడు



లక్ష్మణ్ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): తండ్రి చనిపోయాడు.. తల్లి ఉన్నా దగ్గరికి చేరదీయడం లేదన్న మనస్తాపంతో అమ్ముల లక్ష్మణ్(22) అనే యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కొండపాక మండలం వెలికట్ట గ్రామశివారులో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అమ్ముల అనసూయకు ఇద్దరు కొడుకులు అమ్ముల భాస్కర్, లక్ష్మణ్ ఉన్నారు. ఆమె భర్త యాదయ్య కుటుంబ కలహాలతో ఆరేళ్ల కిందట ఉరేసుకొని మృతి చెందాడు. అప్పటి నుంచి అనసూయ నంగునూరు మండలం రాజ్‌గోపాల్‌పేటలోని తల్లిగారింట్లో ఉంటుంది. అన్నదమ్ముళ్లు నానమ్మ వద్ద ఉంటున్నారు. లక్ష్మణ్ టైల్స్ పనులు చేస్తూ ఉండేవాడు. తండ్రి మృతి చెందడం, తల్లి వేరేచోట ఉంటుండటంతో మదన పడుతుండేవాడు. దీంతో తాగుడుకు బానిసై అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం తెలియక గ్రామ శివారులో ఉదయం పూట కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి వాగు వద్ద చెట్టుకు ఉరేసుకొని మృతి చెందాడు. మృతుని అన్న భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కుకునూరుపల్లి ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

వరకట్నపు వేధింపులతో..



అలేఖ్య (ఫైల్)

మద్దూరు(హుస్నాబాద్): వరకట్నపు వేధింపులు భరించలేక వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దూల్మిట్ట మండలం లింగాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ విజయ్‌కుమార్ వివరాలు. గ్రామానికి చెందిన ముక్కరాజుతో తొగుట మండలం గణపురం గ్రామానికి చెందిన అలేఖ్యకు(22) రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ క్రమంలో వరకట్నం కోసం అలేఖ్యను భర్త రాజు, అత్తామామలు లక్ష్మి, కనకయ్యలు వేధింపులకు గురి చేశారు. దీంతో ఈనెల 25తేదిన అలేఖ్య ఇంట్లో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో రాజన్న సిరిసిల్లా జిల్లాలోని ఎల్లారెడ్డిపేటలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. ఆమెకు పది నెలల బాబు ఉన్నాడు.

మార్పులు సరిచేసుకోవాలి



ఓటు హక్కు పత్రాన్ని పరిశీలిస్తున్న దేవ్‌జా

జిన్నారం(పటాన్‌చెరు): 18ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని, తప్పులు ఉంటే సరిచేసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవ్‌జా సూచించారు. జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో.. ప్రతిఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. సందేహాలుంటే అధికారులను సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, ఆర్‌ఓ శ్రీధర్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

చేగుంటలో అదృశ్యమై.. తూప్రాన్‌లో శవమై..

- కుళ్లిన స్థితిలో హల్దీవాగులో తేలిన మృతదేహం
- హత్యా..ఆత్మహత్యా..? అనే కోణంలో దర్యాప్తు



మైపాల్ (ఫైల్)

తూప్రాన్: మెదక్ జిల్లా చేగుంట మండలంలో అదృశ్యమైన వ్యక్తి పదిహేడు రోజుల తర్వాత తూప్రాన్ పట్టణ సమీపంలోని హల్దీవాగులో శవమై తేలాడు. నడుముకు తాడు బిగించి, కుళ్లిన స్థితిలో మృతదేహం ఉంది. ఇది హత్యా.. ఆత్మహత్యా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఎస్‌ఐ శివానందం వివరాలు. చేగుంట మండలం కర్నాంపల్లి గ్రామానికి చెందిన చింతాకుల మైపాల్ యాదవ్(32) ఈ నెల 10న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. 11న అతని భార్య లత చేగుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 17 రోజుల తర్వాత శనివారం తూప్రాన్ సమీపంలోని హల్దీవాగులో మృతదేహం తేలింది. ఇస్లాంపూర్ గ్రామస్తులు గమనించిన పోలీసులకు సమాచారం అందించారు. ఆదివారం మృతదేహాన్ని బయటకు తీసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చేగుంటలో మిస్సింగ్ కేసు నమోదు కావడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు ఆదివారం పోస్టుమార్టం గదిలో మృతుని బట్టలు, కాలుకు ఉన్న నల్లని తాడును చూసి మైపాల్ యాదవ్‌గా గుర్తించారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్‌ఐ తెలిపారు. మైపాల్‌కు మృతికి వివాహేతర సంబంధమే కారణమై ఉండొచ్చని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.